

# వేదవాక్యం

చెళ్లూరి సీతారామేశ్వరరావు

"మీరెంత అమాయకులండీ" అంటూం టుంది మా ఆవిడ. ఇది విని విని నాకు విసుగుపుడుతోంది. తను తెలివైన దానినని చెప్పుకోడానికి తిరగేసి చెబుతోందనిపిస్తోంది.

ఇంకా సంక్రాంతి వారం రోజులు వుండగా మా రైతు పొలం శిస్తు వెయ్యి రూపాయిలు తెచ్చి నా చేతిలో పోశాడు. సమయానికి వేదవతి వూర్లో లేదు. పుట్టింటికి వెళ్ళింది. ఈవాళో రేపో వచ్చేస్తుంది.

నేను వరండాలో విశ్రాంతిగా కూర్చుని ఆ వెయ్యి ఏంచేద్దామని ఆలోచిస్తూండగా అప్పలస్వామి వచ్చాడు.

డొంకతిరుగుడు లేకుండా "నాకు వెయ్యి అప్పుకావాలి," అన్నాడు.

నా దగ్గర డబ్బుందని వీడికెలా తెల్సింది? నేనెవరితోను అనలేదే "అప్పాజీ! జ్యోతిష్యం నేర్చుకున్నావా?"

"ఒరేయ్ విస్సిగా! జోకు లెయ్యకు. ఇది సమయం కాదు. అవతల ఏజెంటు




కూర్చున్నాడు. రేపు సాయంత్రంలోగా యిచ్చేస్తాను."

అప్పలస్వామికి సెంటర్లో బట్టల కొట్టు వుంది. నమ్మకమైన వాడే. కానీ నా దగ్గర వున్న వెయ్యి యివ్వడానికి భయమేసింది. రైతు డబ్బు యిచ్చినట్లు ఆమెకి తెలిసిపోతుంది. ఇక యుద్ధానికి దిగుతుంది.

"ఎలాగరా? మంచి రద్దీ సమయంలో వచ్చావు"

"నీదగ్గర వుంటుందేమిటిరా? ఎక్కడయినా ప్రయత్నించు. ఎంత వడ్డీఅయినా ఫర్వాలేదు. అవతల మాట పడాలి." ఆదుర్దాగా అన్నాడు.

"శంభాజీ యిస్తాడు కాని, వడ్డీ ఎక్కువ." అన్నాను నెమ్మదిగా. రెండు రోజులే కదా! పదో యిరవయ్యో వస్తాయని ఆశ పీకింది.

"అయినా ఫర్వాలేదు. అవసరం మరి."

"వాడు హామీ లేనిదే యివ్వడే. గొప్ప చిక్కు వచ్చిపడిందయ్యా, బొత్తిగా ముఖమాటం లేని మనిషి."

అప్పలస్వామి జేబులోంచి గొలుసు తీసి యిచ్చాడు. తొందరగా పోయిరా. నేనే వెళదామంటే కొన్ని రిస్కు లున్నాయి."

లోపలకెళ్ళి బట్టలులేసుకుని వెయ్యి లోపల జేబులో పెట్టుకుని గొలుసు తీసుకుని "ఇప్పుడే వచ్చేస్తాను. కూర్చో," అని బయలుదేరాను.

నేరుగా కంసాలి దగ్గరికి నడిచాను. గొలుసు మంచిదో కాదో పరీక్ష చేయించాను. పదహారు వందలకి ధర కట్టాడు, వెయ్యి యిచ్చినా ఫర్వాలేదు. వాడి సొమ్ము మన దగ్గరే వుంటుంది.




వేగిరం యింటికి వచ్చి "రోజుకి తొమ్మిది రూపాయలు వడ్డీ. అవసర మంటున్నావని తెచ్చాను," అంటూ డబ్బు యిచ్చాను.

"థాంక్యూ." అప్పలస్వామి వెళ్ళి పోయాడు.

సాయంత్రం ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికి వేదవతి వచ్చివుంది. పిల్లలతో యిల్లు గోలగా వుంది.

"రైతు డబ్బు తెచ్చాడుట కదా!" వేదవతి తొలి ప్రశ్న.

"ఇచ్చాడు. దానిమీద యిరవై సంపాదిస్తున్నా," అంటూ అప్పలస్వామికి యిచ్చిన పైకం చెప్పాను.

"మనకి వడ్డీవ్యాపారా లెందుకండీ? వాడు అప్పు తీరుస్తాడా?"

"తీర్చకపోతే గొలుసు పోతుంది. నేనంత వెర్రివాడ్నా. అందాకా ఈ గొలుసు వేసుకో," గొలుసు తెచ్చి యిచ్చాను గర్వంగా.

గొలుసు పట్టుకుని వేదవతి కెవ్వు మంది. "ఇది నా గొలుసేనండీ. మొన్న అప్పలస్వామి పెళ్ళాం పెళ్ళికి వెళుతూ అడిగితే యిచ్చాను."

నాకు మతిపోయింది. నా వస్తువు నా దగ్గర తాకట్టు. నేను వెళ్ళినా అప్పలస్వామి కొట్లోలేడు. మర్నాడు వేదవతి వాడి దుకాణానికి పోయి గంటలో తిరిగి వచ్చింది. "అపదలో అబద్ధమాడాట్ట. డబ్బు రేపుగాని యివ్వలేనన్నాడు. నేను వూరుకుంటానా? రెండు పట్టు చీరలు తీసుకు వచ్చేశాను. పన్నెండువందలు."

ఆ డబ్బుతో సైకిల్ కొనుక్కుందామని ఎప్పట్నుంచో నా ప్లాను. ప్రాప్తం లేదు. తప్పు నామీద లేకుండా పోయినందుకు సంతోషించాను.

నేను తెలివితక్కువ వాడ్నో, మా ఆవిడ తెలివైనదో మీరే గమనించండి.

———